క్లుప్తంగా

అలరించిన వారోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీ అన్నమయ్య వాణి లలిత సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు గద్వాల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవనమాలి పాదపద కవితా తాతా సంకీర్తనా చతుర్ధ వారోత్సవాలు శుక్రవారం నాలుగో రోజు అలరించాయి. గద్వాల చంద్రశేఖరరావు సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కచేరీ నిర్వహిస్తున్నారు. పి.సాయిబాబా, వెంకట శ్రీనివాస కళ్యాణ చక్రవర్తి, వెంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటైన ఇంటర్ జూనియర్ కళాశాలలో వివిధ సబెక్టుల్లో బోధించేందుకు అధ్యాపకులు కావాలని కళాశాల ప్రిన్సిపల్ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ, ఎంఏ, తదితర విద్యార్హతలు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు, బోటనీ, కెమిస్ట్రీ, కామర్స్, ఇంగ్లీష్, జువాలజీ, అర్థశాస్త్రం సబెక్టుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. వివరాలకు 7780371321 నంబరును సంప్రదించాలని సూచించారు.

సొంత భవనాలు నిర్మించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కోరారు. జిల్లా కేంద్రం సద్దల్‌గుండ్‌లోని తమ సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉర్దూ మీడియం పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం సొసైటీ తరఫున మెయిల్ ద్వారా సీఎం కార్యాలయానికి వినతిపత్రం పంపించినట్లు తెలిపారు. సొంత భవనాలు నిర్మించాలని, నియామకాలు చేపట్టాలని అన్నారు. సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, షేక్ మహమూద్, మిర్జా ఖాజా అలీబేగ్, మహ్మద్ మహెబూబ్‌అలీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆరాధనోత్సవాలు



అడ్డాకుల: కందూర్‌లో శ్రీకృష్ణమాంబ ఆలయం వద్ద 24వ ఆరాధన సహిత సప్తాహ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. డాక్టర్ గంగాధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద ఐదు రోజులుగా అఖండ భజనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి గురుపూజ మహోత్సవం నిర్వహించారు. అదేవిధంగా ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు అభిషేకం నిర్వహించారు. రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈనెల 30న రథోత్సవం, జూలై 1న పూర్ణాహుతి, గురుపాదుక పూజ ఉంటాయని వివరించారు.

బాధితులకు పరామర్శ

అడ్డాకుల: ఎంపీపీ దోనూరు నాగార్జున్‌రెడ్డి తండ్రి వెంకటరామరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. అదేవిధంగా శాఖాపూర్‌నకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సత్యారెడ్డి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన పట్నం సాయిరాం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొంది ఇంట్లో ఉండి కోలుకుంటుండటంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీ కోఆప్షన్ మహిమూద్, తోకల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నేడు సమావేశం

జడ్చర్ల: పురపాలిక సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 11.30 లకు నిర్వహించనున్నారు. కాగా మున్సిపల్ పరిధిలో సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు తీవ్రంగా పరిగణిస్తున్న క్రమంలో నిర్వహిస్తున్న సమావేశం వాడీ వేడిగా జరిగే అవకాశం ఉంది. అధికారులు, సిబ్బంది పనితీరుపై కూడా సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

బిల్స్ విడుదల చేయాలి

పాలమూరు : రాష్ట్ర ప్రభు త్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎన్‌జీఓజిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్‌చేశారు. పీఆర్‌సీపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. సీఎంపై విశ్వాసం ఉందన్నారు.

వర్షం కురవాలని పూజలు

మరికల్: వర్షాలు లేక పంటలు ఎండుముఖం పట్టడంతో శుక్రవారం మండలంలోని మహిళలు కప్ప కావడికి పూజలు చేసి ఊరేగించారు. మంచి వర్షాలు కురవాలని, పంటలు పండాలని పాటలు పాడి, ఇంటింటి తిరిగి మహిళలు కప్ప కావడిపై బిందెలతో నీళ్ల పోస్తు పూజలు చేశారు.



నవాబుపేటలో ఆన్‌లైన్ చేయించుకునేందుకు భారీగా తరలివచ్చిన జనం

గృహజ్యోతి ఆన్‌లైన్ కోసం లబ్ధిదారుల అవస్థలు

గంటల తరబడి నిరీక్షణ

నవాబుపేట/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ (చిన్నచింతకుంట): గృహజ్యోతి పథకంలో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి లైన్‌లో నిరీక్షిస్తున్నారు. జీరో బిల్లు, సిలిండర్ సబ్సిడీ రాకపోవటంతో మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు భారీగా కేంద్రాల వద్దకు తరలివస్తున్నారు. శుక్రవారం నవాబుపేట మండల కేంద్రంలో జనం పెద్ద ఎత్తున వినతులతో ఆశావహులు లైన్‌లో నిరీక్షించారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం రోజంతా సందడిగా మారింది. కాగా ఆన్‌లైన్ ప్రక్రియకు కేవలం ఇద్దరు మాత్రమే ఆపరేటర్లు ఉండడంతో.. జనం నిరాశ వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరు కార్యాలయ సిబ్బంది సైతం ఆన్‌లైన్ ప్రక్రియ చేయటం ప్రారంభించారు. కాగా అధికారుల నిర్లక్ష్యంగా అభయహస్తం దరఖాస్తులు తప్పుగా నమోదు చేశారని.. దీంతో తమకు పథకాలు అందాలంటే ఇలాంటి ప్రయాస తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎక్కడక్కడే అదే గ్రామాల్లోనే ఆన్‌లైన్ నమోదు చేయాలని కోరుతున్నారు.

చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు సైతం వివిధ గ్రామాలనుంచి లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం గందరగోళంగా మారింది. లబ్ధిదారులకు సిలిండర్ నమోదు ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కేవైసీ, ఎల్‌పీజీ నంబర్, కన్జ్యూమర్ నంబర్ ట్యాలీ కాకపోవడం వంటివాటితో ఆన్‌లైన్‌లో నమోదు కావడంలేదు. దీంతో ఈ కేవైసీలు చేసుకునేందుకు గ్యాస్ ఏజెన్సీల చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది.



చిన్నచింతకుంటలో..

బిల్లులు చెల్లించాలని రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన పాడిరైతులు

మిడ్జిల్: మండల పరిధిలోని బోయిన్‌పల్లిలో పాడి రైతులు తమకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వారికి బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జయప్రసాద్ ఘటన స్థలానికి చేరుకొని రైతులను శాంతింపజేశారు. కార్యక్రమంలో నాయకులు రవిగౌడ్, నారన్‌రెడ్డి, హరికిషన్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లెయిమ్స్ పరిష్కరించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం



మాట్లాడుతున్న వదరగాలన్న

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్ పరిష్కరించాలని.. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వదర గాలన్న డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మికులకు సంబంధించి సాధారణ మరణం, యాక్సిడెంట్, మరణం కాన్పు, పెళ్లి ఇలా రకరకాల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అనేకసార్లు ఆఫీస్ చుట్టూ తిరిగినా, వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కరించేవారే కరువయ్యారని వాపోయారు. నెల రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు కేశవులు కార్మికుల భీమా ఇన్సూరెన్స్ కార్డులు రెన్యూవల్ కూడా కావడంలేదని వాపోయారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకట రాములు గౌడ్, వెంకటయ్య, శ్రీనివాసులు, హనుమంతు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జడ్చర్ల ఎమ్మార్వో వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. మూతబడిన పాఠశాలలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యాల ఫీజుల దోపిడీ, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో చేస్తున్న వ్యాపారాలు నియంత్రించాలన్నారు. కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. నగర కార్యదర్శి శివకుమార్, మణి, రవీంద్ర, మారుతి, నరేష్‌కుమార్, రాఘవ, అజయ్, నవనీత, శోభ, శృతి, శివరంజని, భరత్ పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయ ముట్టడికి యత్నం

పాలమూరు: జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ఏబీవీపీ నాయకులు యత్నించారు. జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ప్రారంభమై నెల గడుస్తున్నా ఇంకా విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందజేయలేదన్నారు. ప్రభుత్వం కనీసం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించే పరిస్థితిలో లేదన్నారు. వసతులు లేకపోవడం, టీచర్ల కొరత వల్ల విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు నవేంద్ర, మల్లికార్జున్, శివ, అరవింద్, అక్షయ, కార్తిక్, వరుణ్, శివ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహరావుకే దక్కిందని డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ జయంతి నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బెనహర్ మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఓర్చుకున్నారని కొనియాడారు. నాయకులు ఫహీం, ఏర్పుల నాగరాజు, ఎండీ తాహెర్, కృష్ణయ్య, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

పోల్కంపల్లి నల్లకుంట వద్ద వివాదం



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

అడ్డాకుల : మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులోని నల్లకుంట వద్ద శుక్రవారం వివాదం ఏర్పడింది. నల్లకుంటలో పట్టా పొలాలు ఉన్నాయని కొందరు రైతులు ఇటీవల చేపలు పట్టడాన్ని అడ్డుకున్నారు. ఈ వివాదం కోర్టు వరకు వెళ్లింది. కోర్టు ఆదేశాలతో ముదిరాజ్ సంఘం ద్వారా చేపలు పట్టేవారికి శుక్రవారం భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ సుజాత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొందరు రైతులు చేపలు పట్టకుండా అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని సముదాయించి పంపించారు.

పక్కాగా పథకాల అమలు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండీడ్: మాట ఇస్తే మాట తప్పనిది కాంగ్రెస్ పార్టీ అని.. పక్కాగా పథకాల అమలుకు కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గండీడ్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డిపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. జానంపల్లి, కప్లాపూర్, గోవింద్‌పల్లి గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, పీర్లబండతండా బ్రిడ్జి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వెన్నాచేడ్‌లో కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. కాంగ్రెస్ హామీల అమలుకు కృషి చేస్తోందని.. మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. రెండు నెలల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు వివరించారు. గండీడ్ మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్థాయిలో పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కేజీబీవీ ఏర్పాటుకు కూడీ రూ.5 కోట్లు మంజూరయ్యాయని త్వరలో స్థల సేకరణ పూర్తి చేసి నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ నాగలక్ష్మి, ఎంపీటీసీలు శైలజా బాలవర్ధన్‌రెడ్డి, బాలయ్య, వెంకట్‌రాంరెడ్డి, పీసీసీ మెంబర్ నరసింహరావు, జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పుల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆశిరెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జితేందర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత పాల్గొన్నారు.

30న ఎన్నికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణ ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఈనెల 30న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఎన్నికల కమిటీ ప్రతినిధులు నలిగేశి లక్ష్మీనారాయణ, సయ్యద్ నుస్రత్, నరసప్ప, సత్యం యాదవ్, రాఘవులుగౌడ్, శివరాజ్ శుక్రవారం సంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటు వేసేవారు తప్పనిసరిగా సంఘంలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉండాలన్నారు.

రెండో రోజూ భారీవర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఆ తర్వాత తుంపరతో చినుకులు పడ్డాయి. దీంతో డ్రెయినేజీలు పొంగి రోడ్లపైకి మురుగు, బురద వచ్చింది. వాహనదారులతో పాటు ప్రజలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు పదిరోజుల తర్వాత ఈనెల 27 నుంచి వర్షం వరుసగా కురుస్తుండటంతో అంతా చిత్తడిచిత్తడిగా మారింది.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్

జడ్చర్ల: సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చంద్రమోహన్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణ శివార్లలోని హోటళ్ల ప్రాంగణాలలో పరదాలు కట్టి బహిరంగంగా దూమపానం చేస్తున్న పలువురికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇక నుంచి హోటళ్లు, బస్‌స్టాప్ తదితర ప్రజలు ఉండే బహిరంగ ప్రదేశాలలో పొగతాగే వారిపై చర్యలు చేపడుతామని తెలిపారు. హోటళ్ల దగ్గర పరదాలు కట్టి గంజాయి వంటివి సేవిస్తున్నారన్న సమాచారం మేరకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి మత్తులో విచ్చలవిడిగా బైక్‌లు, తదితర వాహనాలను నడుపుతున్నారన్న సమాచారం వస్తుందని వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

భోజనశాల ప్రారంభం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఉన్న ఊర్కొండ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో రోటరీ క్లబ్ సహకారంతో నిర్మించిన భోజనశాలను శుక్రవారం ప్రారంభించారు. కాగా రోటరీక్లబ్ ప్రతినిధులు భోజనశాలను ఆధునికీకరించారు. అయితే ప్రారంభ కార్యక్రమం గోప్యంగా ఉంచడం విమర్శలకు తావిస్తోంది.

గడ్డకట్టిన ఎరువులు

- తిప్పిపంపిన అధికారులు

రాజాపూర్: రైతులకు అందుబాటులో ఉంచేందుకు డీఏపీ 150 బస్తాలు, 20..20 ఎరువులు బాలానగర్ మండల రైతుఆగ్రోస్ కేంద్రానికి శుక్రవారం లారీల్లో వచ్చాయి. కాగా అట్టి ఎరువులు 80 శాతం గడ్డకట్టి ఉండటంతో గుర్తించిన రైతులు సుధాకర్‌రావు, చెన్నరెడ్డి తదితరులు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మండల వ్యవసాయశాఖ అధికారి ప్రశాంత్‌రెడ్డి ఎరువులను తిరిగి వాటిని తిప్పి పంపారు. ఇటువంటి ఎరువులను మరోసారి పంపిస్తే సంబంధికులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ప్రక్రియ పరిశీలన

రాజాపూర్: బాలానగర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు శుక్రవారం పరిశీలించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎంపీడీఓ శరత్ చంద్రబాబు, ఎంపీఓ విజయకుమారి తదితరులు ఉన్నారు.

ప్రైవేటీకరణ ఆపాలని తీర్మానం చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

జడ్చర్ల టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గుగనుల ప్రైవేటీకరణ (వేలం) ఆపి నేరుగా సింగరేణికి కేటాయించాలని.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని నాయకులు అన్నారు. ఈ మేరకు సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. నాయకులు పోలె జగన్, సత్తయ్య మాట్లాడారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మున్నా, జయరాములు, యాదయ్య, కృష్ణయ్య, సంధ్యారాణి, కృష్ణవేణి, లలిత, నాగమణి, హన్మానాయక్ పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనలో భాగస్వామ్యం అవసరం



మాట్లాడుతున్న డా.రఫీఖ్

జడ్చర్ల టౌన్: టీబీ నిర్మూలనలో కమ్యూనిటీ భాగస్వామ్యం అవసరమని.. జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా. రఫీఖ్ అన్నారు. శుక్రవారం కావేరమ్మపేట పల్లె దవాఖనాలో జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమం, టీబీ అలెర్ట్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో.. ఎంపిక చేయబడిన పరిశ్రమల ప్రతినిధులు, మహిళలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు టీబీపై అవగాహన పెంచాలని, అందుకు శిక్షణకు వచ్చిన వారు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా టీబీ అలెర్ట్ ఇండియా ప్రతినిధి పురుషోత్తం తమ సంస్థ ద్వారా చేస్తున్న కార్యక్రమాల గురించి ప్రొజెక్టర్ సాయంతో వివరించారు. కార్యక్రమంలో గంగాపురం పీహెచ్‌సీ డా.సమత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటితేనే భవిష్యత్



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న కృష్ణసాగర్

అడ్డాకుల: పర్యావరణాన్ని కాపాడేందుకు అందరం కలిసి మొక్కలు నాటి.. సంరక్షిస్తేనే భావి తరాలకు భవిష్యత్ ఉంటుందని సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు చీర్ల కృష్ణసాగర్ అన్నారు. 'మొక్కలు నాటండి, పర్యావరణాన్ని కాపాడండి' అనే నినాదంతో ఆయన చేపట్టిన పాదయాత్ర శుక్రవారం అడ్డాకుల, శాఖాపూర్, కందూర్ స్టేజీ, పొన్నకల్ స్టేజీ, మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి, మూసాపేట, జానంపేట, గాజులపేట స్టేజీల మీదుగా 44వ నంబర్ జాతీయ రహదారిపై భూత్పూర్ మండలానికి చేరుకుంది. ప్రపంచ వృక్ష దినోత్సవంలో భాగంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో గోపాల్, దేవేంద్రం, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ నిర్మాణానికి రూ.2లక్షలు

జడ్చర్ల టౌన్: స్థానిక 14వ వార్డు సంజీవయ్య కాలనీలో రైల్వే ప్రహరీకి అనుకుని మురుగు కాల్వ నిర్మాణం కోసం రూ.2లక్షలు మున్సిపాలిటీ నిధులు మంజూరైనట్లు కౌన్సిలర్ కోనేటి పుష్పలత తెలిపారు. రైల్వే ప్రహరీ నుంచి రమేష్ ఇంటి వరకు కాల్వ నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. అదే విధంగా మోపతయ్య ఇంటి ఎదుట ఉన్న కాల్వ చెత్తాచెదారంతో నిండి జాం కావటంతో శుక్రవారం శుభ్రం చేయించారు.

పుస్తకాల పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ భగవంతాచారీ, ఒకేషనల్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: కాంగ్రెస్ నాయకుడు దుష్యంత్‌రెడ్డి శుక్రవారం కల్లేపల్లిలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ జగన్నాథ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా.. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆయన కుటుంబసభ్యులతో కలిసి విద్యా సామగ్రి పంపిణీ చేశారు. జగన్నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను అభినందించారు.

మహారాష్ట్రీ కర్నూలు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
O.S. No. 8/2019

లాల్‌కోట సునితాదేవి .. వాది
-Vs-
కొట్టా వెంకమ్మ వగైరా .. ప్రతివాది

9వ ప్రతివాదికి దావా సమన్లు

ఎం.శ్రీదేవి భర్త [illegible] 1-1-9/1/12, న్యూ మారుతి నగర్, మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా.

పై నెంబర్ దావాలో వాది [illegible] దాఖల ఆస్తిలో 1/13వ భాగం [illegible] దావా దాఖలు చేస్తూ [illegible] (2) [illegible] 1/13వ భాగం [illegible] (3) 15.12.2014వ తేదీన [illegible] దావా దాఖలు చేసినది. ఇందులో 9వ ప్రతివాది అయిన [illegible] 22.07.2024 తేదీ పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరు [illegible] తెలుసుకొనవలెను. [illegible]

షెడ్యూలు: [illegible] 192/81లో [illegible] 430.5 [illegible] RCC [illegible] విలువ రూ. 14,39,039.00

2. [illegible] 27 [illegible] 5.98 [illegible] విలువ రూ. 8,97,23,920.00

3. [illegible] 389/4 [illegible] 1.28 సెం [illegible] మార్కెట్ విలువ రూ. 1,98,400.00

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

సి.వి.రామ్‌ప్రసాద్, కె.విజయలక్ష్మి
వాదివరపు అడ్వకేట్స్, కర్నూలు. సెల్: 83339 34426

తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని రోజులుగా పట్టణానికి మిషన్ భగీరథ పథకం నుంచి అవసరమైన మేరకు తాగునీరు సరఫరా కాకపోవడంతో మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాంరెడ్డిగూడ పంప్ హౌస్ నుంచి అందుతున్న 20 ఎంఎల్‌డీ నీటిని పట్టణం మొత్తం సరఫరాకు పైపులైన్ అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, మెట్టుగడ్డ వద్ద అప్పట్లో ఏర్పాటుచేసిన పెద్ద గేట్‌వాల్వ్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అయితే ఈ లైన్ వెంట మూడుచోట్ల లీకేజీలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని వెంటనే సరిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మున్సిపల్ షాపుల పరిశీలన

స్థానిక మార్కెట్ ఏరియాలో దెబ్బతిన్న సుమారు 15 మున్సిపల్ షాపులను శుక్రవారం చైర్మన్, ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ షాపులను సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించడంతో అప్పుడప్పుడు పై పెచ్చులు ఊడిపోతున్నాయి. దీంతో వీటికి మరమ్మతు చేయించాలా? లేక కూల్చి వేయాలా? అనే విషయాన్ని తేల్చడానికి ఆర్‌అండ్‌బీ అధికారులతో త్వరలో సర్వే చేయించనున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ జె.పవన్ కుమార్, ఎంఈ యు.బస్వరాజ్, ఆర్‌ఓ మహ్మద్‌ఖాజా, ఆర్‌ఐ ముజీబ్ పాల్గొన్నారు.